

జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్‌తో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి శృతిఓజా

# ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

- ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కమిషనర్, గద్వాల జిల్లా ప్రత్యేకాధికారి శృతిఓజా

గద్వాల రూరల్, మే 22 : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఇంటర్మీడియెట్ విద్యా శాఖ కమిషనర్, జోగుళాంబ గద్వాల జిల్లా ప్రత్యేకాధికారి శృతిఓజా పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ సంతోష్‌తో కలిసి గద్వాల మండలంలోని బీరెల్లి, లత్తీపురంలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా 70 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పది కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరిస్తున్నామన్నారు. కేంద్రాల్లో ఏర్పాట్లు, సదుపాయాలను పరిశీలించారు. అధికారులు ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా, పూర్తి స్థాయిలో మద్దతు ధర ఇస్తున్నారా, తరుగు సరిగ్గా తీస్తున్నారా అని రైతులతో ఆరా తీశారు. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లర్లకు తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఎస్ ప్రధాన కాల్వ గట్లపై ముళ్ల పొదలు తొలగిస్తున్న జేసీబీ

# ఆర్డీఎస్ కాల్వలో పూడిక తొలగింపు

- రూ.36 లక్షల వ్యయంతో పనులు

అయిజ, మే 22 : ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పూడిక, ముళ్లపొదల తొలగింపు పనులు చేపడుతున్నారు. 2022-23లో కేసీఆర్ సర్కారు హయాంలోనే రూ.36 లక్షలు విడుదల చేసి, పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే, వానకాలం సమీపించడంతో పనులు చేపట్టడంలో ఆలస్యమైంది. ప్రస్తుతం అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయడంతో ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పేరుకుపోయిన పూడిక, కాల్వ గట్లకు ఇరువైపులా ముళ్ల పొదల తొలగింపు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. జూన్ చివరి నాటికి తొలగింపు, డిస్ట్రిబ్యూటరీ మరమ్మతు పనులు పూర్తి చేసి వానకాలం పంటలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పూడికతీత చేపడితే కాల్వలో సాగునీరు ఎక్కువగా పారే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



జెర్రిపోతుపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న సదాశివయ్య

# కేసీఆర్ ఎకో పార్కులో స్నేక్ షో

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 22 : సర్పాల జీవన విధానంపై జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సదాశివయ్య అవగాహన కల్పించారు. బుధవారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అప్పన్నపల్లి శివారులో ఉన్న కేసీఆర్ ఎకో అర్బన్ పార్కులో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంలో భాగంగా స్నేక్ షోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాము ముందు వైపు మాత్రమే చూస్తుందని.. ఏ పాము అయినా పదిసార్లు కరిచేందుకు ప్రయత్నిస్తుంది కానీ.. వెంటనే కాటు వేయదన్నారు. జెర్రిపోతును చిన్నారులకు చూపించి వారి చేతికి అందజేశారు. పాము కనిపించినప్పుడు ధైర్యంగా ఉండాలని.. భయపడొద్దని సూచించారు. శిక్షణ పొందితే ఆడామగ తేడా లేకుండా ఎవరైనా పామును పట్టుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, ఫారెస్టు అధికారి రాజశేఖర్‌తోపాటు ప్రజలు పాల్గొన్నారు.



పాముల గురించి పోలీసులకు వివరిస్తున్న సదాశివయ్య

# తల్లీకూతురు ఆత్మహత్య

- ప్రాణాలు తీసిన భూవివాదం, కుటుంబ కలహాలే కారణం?

మానవపాడు, మే 22 : భూ వివాదం, కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై తల్లీకూతుళ్లు ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం ఏ బూడిదపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఏ బూడిదపాడుకు చెందిన మాల నర్సింహులుకు భార్య వరలక్ష్మి (39), కూతురు అనురాధ (18), కుమారుడు ఉన్నారు. కొన్ని రోజులుగా నర్సింహులు అన్నాదమ్ముళ్ల మధ్య భూ తగాదాలు జరుగుతూనే ఉన్నాయి. చాలాసార్లు గొడవలు కూడా జరిగినట్లు తెలుస్తున్నది. కూతురు పెండ్లి, కుమారుడి చదువు కోసం ఇబ్బందులు పడుతుండగా.. వారసత్వంగా వచ్చినది సీలింగ్ భూమి కావడంతో కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయంలో సహకరించాలని అన్నదమ్ముళ్లను కోరినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన నర్సింహులు మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. భార్య వరలక్ష్మి, కూతురు అనురాధ పురుగులమందు తాగగా.. నర్సింహులు భయపడి తాగలేదు. వరలక్ష్మి, అనురాధ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స అందించేలోపే ఇద్దరూ మృతి చెందారు. కండ్ల ముందే భార్య, కూతురు చనిపోవడంతో నర్సింహులు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అయితే, ఈ ఘటన సమయంలో కుమారుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలిసింది. మృతురాలు వరలక్ష్మి అన్న రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.



వరలక్ష్మి, అనురాధ (ఫైల్)

## ఆర్‌ఎన్‌ఆర్ @ రూ.2,504

జడ్చర్ల, మే 22 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి అత్యధికంగా క్వింటాకు రూ.2,504 ధర పలికింది. బుధవారం మార్కెట్‌కు ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యంతోపాటు మొక్కజొన్న, జొన్న అమ్మకానికి వచ్చాయి. ఆర్‌ఎన్‌ఆర్ 4,758 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠంగా రూ.2,504, కనిష్ఠంగా రూ.1,901, మధ్యస్తంగా రూ.2,159 ధర పలికింది. జొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ.4,927, మొక్కజొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ.2,289 ధర లభించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.



పీయూలోని స్ట్రాంగ్‌రూం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్





నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లు

## భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్, మే 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. ఆదివారం పాలమూరు యూనివర్సిటీలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంల వద్ద పోలీస్ భద్రత, సీసీ కెమెరాల పనితీరు, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచిన స్ట్రాంగ్ రూంను కూడా పరిశీలించారు.

# భవితవ్యం.. భద్రం

- ఈవీఎం స్ట్రాంగ్‌రూంల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- పార్లమెంట్ అభ్యర్థుల ఎదుటే తాళాలు
- రాష్ట్ర, కేంద్ర పోలీసు బలగాల మూడంచెల పహారా
- జూన్ 4వ తేదీ వరకు 24 గంటల పాటు సీసీ నిఘా

నాగర్‌కర్నూల్, మే 22 (నమస్తే తెలంగాణ) : దేశ భవిష్యత్తును తేల్చనున్న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్నాయి. ఈనెల 13న జరిగిన పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్ రూంలో గట్టి బందోబస్తు నడుమ భద్రపరిచారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో.. జిల్లా స్థాయి పోలీసు అధికారి ఆధ్వర్యంలో 24 గంటలపాటు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తు మరో 12 రోజుల పాటు కొనసాగనున్నది. ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు.. ఫలితాలతో విజయవంతంగా పూర్తయ్యేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.

### స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రత

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన 2,050 పోలింగ్ బూత్‌ల నుంచి వచ్చిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను జిల్లా కేంద్రంలోని నెల్లికొండ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు చేర్చారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి వచ్చిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో భద్రపరిచారు. నాగర్‌కర్నూల్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ అభ్యర్థిగా భరత్ ప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లు రవితో పాటు 19 మంది పోటీలో నిలిచారు. మహబూబ్‌నగర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, కాంగ్రెస్ నుంచి వంశీచంద్‌రెడ్డితోపాటు పలువురు బరిలో ఉన్నారు. ఈ అభ్యర్థుల భవితవ్యం ప్రస్తుతం స్ట్రాంగ్‌రూంలలో భద్రంగా నిక్షిప్తమైంది. కౌంటింగ్ వరకు స్ట్రాంగ్ రూంల వద్ద పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. 24 గంటలపాటు సీఏపీఎఫ్ సిబ్బంది పహారా కాస్తున్నారు. ఇక సీసీ టీవీలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతున్నది. స్ట్రాంగ్ రూం ఎదుట కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలతోపాటు రాష్ట్ర పోలీసులు కూడా బందోబస్తులో పాల్గొంటున్నారు. స్ట్రాంగ్ రూం వద్ద మొదటి సర్కిల్‌కు సీఏపీఎఫ్ గార్డులు కాపలాగా ఉండగా.. రెండో సర్కిల్‌లో పోలీసు బృందం, మూడో సర్కిల్‌లో జిల్లాల కార్యనిర్వాహక దళానికి చెందిన గార్డులు భద్రతగా ఉన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా ఉంటున్నది. ఇక నిరంతరం సీసీ కెమెరాలు పని చేయాల్సి ఉంటుండడంతో విద్యుత్ వ్యవస్థకు కూడా అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. వర్షం కురిసినా నీళ్లు లోపలికి వెళ్లకుండా ఉండేలా, నీళ్లు కురియకుండా, పటిష్టమైన గోడలు కలిగి, కొత్తగా నిర్మించిన భవనాన్ని స్ట్రాంగ్ రూం కోసం అందుబాటులో ఉంచారు. జూన్ 4న కౌంటింగ్ సిబ్బందికి స్ట్రాంగ్ రూంలోని ఈవీఎంలను సేకరించడానికి సులువుగా ముందస్తుగా ఎన్నికల అధికారుల సమక్షంలో భద్రపరిచారు. ఒక్కసారి ఈవీఎంలు స్ట్రాంగ్ రూంకు చేరితే పక్షి కూడా దూరనంత భద్రత ఉంటుంది. ఈవీఎంలను ఆయా పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూంల్లోకి చేర్చి వారి ఎదుటనే తాళాలు వేశారు. కౌంటింగ్ రోజు మళ్లీ వారి ఎదుటే తాళాలను తెరుస్తారు. స్ట్రాంగ్ రూంకు ఉన్న రెండు తాళాల్లో ఒకటి జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉంటుంది. రిటర్నింగ్ అధికారి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్ట్రాంగ్ రూం ప్రాంతాన్ని సందర్శించి లాగ్‌బుక్, సీసీటీవీ పుటేజీ పరిశీలించి లాగ్‌బుక్‌లో నమోదు చేస్తారు. అభ్యర్థులకు ఎన్నికల అధికారుల ఫోన్ నంబర్లను ఇప్పటికే అందించారు. ఇక మంత్రులు, అభ్యర్థులు, అధికారుల వాహనాలు మూడో అంచెలోకి రాకముందే నిలిపివేస్తారు. ఎవరైనా అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపు రోజున అభ్యర్థులు, ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారులు మాత్రమే పరిశీలకుడి సమక్షంలో వీడియో చిత్రీకరణతో తాళాలు తెరుస్తారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు జరుగుతుంది. ఈవీఎంలను చూసి ఏమైనా సమస్యలుంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రారంభమయ్యాక.. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల లోని ఓట్లను కౌంట్ చేస్తారు. ఎంపీ అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే ఈవీఎంలు, వీవీప్యాట్‌లకు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పోలీసు శాఖ భరోసా కల్పిస్తున్నది.



### నిత్యం పర్యవేక్షణ..

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఫలితాల ప్రక్రియ కూడా సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించాం. 24 గంటలూ పటిష్టనిఘాతోపాటు భద్రతా చర్యలు ఏర్పాటు చేశాం. ఎన్నికల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అనుమతి లేనిదే మొదటి అంచె భద్రతా వ్యవస్థను కూడా దాటే పరిస్థితులు లేవు.

- వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

- నాగర్‌కర్నూల్ జిల్లాకు చేరిన ఏకరూప దుస్తులు
- మండలాల వారీగా పంపిణీ చేసేందుకు కసరత్తు
- ప్రభుత్వ, మోడల్ పాఠశాలలు, కేజీబీవీల్లో 60,423 మంది విద్యాభ్యాసం
- తరగతుల వారీగా నమూనాల రూపకల్పన
- పాఠశాల పునఃప్రారంభం రోజున జత అందజేత

# యూనిఫాం దుస్తులు వచ్చేశాయ్..



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో భద్రపరిచిన యూనిఫాం వస్త్రాల బస్తాలు



నాగర్‌కర్నూల్ టౌన్, మే 22 : జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫాంకు సంబంధించిన వస్త్రాలు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. మండలాల వారీగా పంపిణీ చేసి.. ఎంపిక చేసిన స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూనిఫాంలు కుట్టించేందుకు విద్య, డీఆర్‌డీఏ శాఖల అధికారులు కసరత్తు చేపట్టారు. గతానికి భిన్నంగా ఈ ఏడాది తరగతుల వారీగా విద్యార్థులకు వేర్వేరు నమూనాల్లో యూనిఫాంలు కుట్టించేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలను విడుదల చేశారు. తప్పనిసరిగా అదే మోడల్‌లో యూనిఫాంలను కుట్టించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు సూచించారు. ఒకటి నుంచి మూడో తరగతి బాలికలకు బాడీఫ్రాక్‌లు, షర్ట్‌లకు సంబంధించి కొలతలతో సహా నిర్దేశించిన రీతిలోనే ఉండాలనే షరతు విధించారు. నాలుగు, ఐదు తరగతుల వారికి స్కర్టులు, చొక్కాలకు రెండు జేబులు, భుజాలపై క్లాకులు, రెండు చేతులపై క్లిప్పులు ఉండేలా నిబంధన పెట్టారు. ఆరు నుంచి 12వ తరగతుల వారికి పంజాబీ డ్రెస్‌లకు హ్యాండ్ క్లిప్స్, కాలర్ నెక్ పట్టి, వాస్కోటు ఉండనున్నది. బాలుర విద్యార్థులకు ప్యాంట్లు, నిక్కర్లు గతంలో మాదిరిగానే ఉండాలని సూచిస్తూ జిల్లా శాఖాధికారులకు విధివిధానాలతో సర్క్యులర్ జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం ఒకటి నుంచి 8వ తరగతుల వరకు 46,529 మంది విద్యార్థులు కేజీబీవీ, మోడల్, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వారిలో బాలురు 22,796, బాలికలు 23,733 మంది ఉన్నారు. 9, 10వ తరగతుల్లో 12,418 మంది విద్యార్థులు ఉండగా.. వారిలో 6,213 మంది బాలురు, 6,205 మంది బాలికలు ఉన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో చదువుతున్న 11, 12వ తరగతుల వరకు 1,476 మంది విద్యార్థుల్లో.. 99 బాలురు, 1,377 మంది బాలికలు ఉన్నారు.



యూనిఫాం వస్త్రాలు

### మహిళా సంఘాలకు బాధ్యతలు..



ఏకరూప దుస్తుల తయారీ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించనున్నాం. ఆసక్తి ఉన్న సంఘాలను ఆహ్వానించి టెండర్లు ఖరారు చేయాల్సి ఉన్నది. ఆ తరువాత మండలాల వారీగా యూనిఫామ్స్ తయారుచేసే బాధ్యతను డీఆర్‌డీఏ అధికారుల సహకారంతో ఎంఈవో పర్యవేక్షణలో సిద్ధం చేయించనున్నాం. విద్యార్థులకు పాఠశాలల జూన్ 12వ తేదీన (పునఃప్రారంభం) ఒక జత దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నాం. మహిళా సంఘాలతో ప్రత్యేకంగా చర్చించి యూనిఫాంలను త్వరితగతిన సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటాం.

- గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్